# పాడకే కోయిలా!

బస్సు బయల్దేరింది... ....

"ఏడుకొండలవాడా...వెంకట్రమణా... ...గోవిందా... ...గోవింద!" - బస్సులో వున్న భక్తులు చాలామంది ముక్త కంఠంతో అన్నారు.

"ఒరేయ్ బుజ్జీ!... ... మరచెంబు గట్టిగా పట్టుకో... కొండమీదకు ఎక్కేటప్పుడు అటూ ఇటూ దొర్లిపోతుంది!" - ఆడవాళ్ళ పక్కన కూర్చున్న ఓ బామ్మగారు వెనకాల సీట్లో కిటికీ దగ్గర కూర్చున్న మనవణ్ణి హెచ్చరించింది.

"బ్రీఫ్ కేస్ ఎక్కడ పెట్టేవ్?" - లాల్చీ జేబులోంచి కళ్ళజోడు తీసిపెట్టుకుంటూ అడిగేడు రంగనాయకులు - తన వెనుకనే కూర్చున్న సదాశివాన్ని.

"నా దగ్గరేవుంది సార్!" - వినయంగా చెప్పేడు సదాశివం.

బస్సు నెమ్మదిగా ఊరుదాటి - ఘాట్ రోడ్డు మొదట్లో వున్న చెక్‌పోస్టు దగ్గరకొచ్చి ఆగింది. దేవస్థానం తాలుకూ ఓ ఉద్యోగీ, మరో కుర్రాడూ అక్కడ బస్సెక్కారు.

బస్సు మళ్ళీ కదిలింది...

భక్తులు చాలామంది వుండి వుండి గోవింద నామస్మరణ చేస్తూనే వున్నారు... అంతలోనే--

" టక టక టక టక్‌టక్ టక్ ... ... టక టక టక టక్ టక్ టక్... ..." చెక్‌పోస్టు దగ్గర బస్సెక్కిన కుర్రాడు పాట అందుకున్నాడు... . చిడతలు చప్పుడుచేస్తూ.

"ఆడించేవాడురా దేవుడు....

ఆడలేని వాడేరా మానవుడు...

నామాలు వుంటేనే దేవుడు!...

నామాలు పెడితేనే నాయకుడు...

ఈ ఇద్దరు ఏలేరు లోకాన్ని....

ఏ ఒక్కరు తీర్చేరూ శోకాన్ని?...

గోవిందా గోవిందా ఎంకన్నా గోవిందా!"

వాడి గొంతులోంచి ఆ పాట మధురమైన ఊపిరి పోసుకుని శ్రావ్యంగా వినిపిస్తోంది.

చాలామంది వాడివైపు కుతూహలంగా చూశారు.

రంగనాయకులు దృష్టి కూడా వాడివైపు మళ్ళింది.

వాడికి మహావుంటే పదిహేనేళ్ళుంటాయి. గుండ్రటి ముఖం... నుదుట తిలకంతో దిద్దిన నామం!.... దానికింద అటూ ఇటూ తీర్చిదిద్దినట్లున్న అందమైన కళ్ళు! .... గిరజాలు తిరిగిన జుట్టు... కుడిచేతి మణి కట్టు మీద కాశీతాడు... మెడలో వెంకటేశ్వరస్వామి బిళ్ళ!...

వాడు వేసుకున్న కాకీ నిక్కరు తొడలమీదకు పోయింది. తొడుక్కున్న చొక్కా రంగు వెలిసిపోయింది.

బస్సులో మధ్యన, నిలువుగా వున్న ఇనపకడ్డీని ఆనుకుని - - చిడతలు వాయిస్తూ పాడుతున్నాడు.

"....హుండీలో వేసేరు కాసులు

ఉండిలేని బ్రతుకుల్లో తిరకాసులు...!

తెలుసుకున్నవాడు ఏడుకొండలవాడు...

తెలిసినా వూరుకుంటే గుండెలేనివాడు...!

గోవిందా గోవిందా వెంకన్నా గోవిందా!"

పాటలోని భావమంతా వాడి అరమోడ్పు కన్నులలోనూ - పదాల విరుపుల్లోనూ ప్రవహిస్తోంది ... ప్రయాణీకుల హృదయాంతరాళాల్లో పారవశ్యాన్ని కలిగిస్తోంది.

"కుర్రాడు బాగా పాడుతున్నాడు కదూ!" --నెమ్మదిగా అడిగేడు రంగనాయకులు సదాశివాన్ని.

"అవును సార్! 'లిరిక్' కూడా అద్భుతంగా వుంది!" --చెప్పేడు సదాశివం.

ఆ మాట విన్నాడో లేదో తెలియదుకానీ -- కొంతసేపు అలాగే ఆలోచిస్తూ వుండి పోయాడు రంగనాయకులు.

పాట పూర్తయింది...

చిడతల్ని చొక్కా జేబులో పెట్టేసి -- ఒక చేత్తో నుదిటిమీద పడుతున్న గిరజాల జుట్టుని వెనక్కి సవరించుకుంటూ, మరో చెయ్యి ముందుకు చాచి అడుక్కుంటున్నాడు వాడు-

"అమ్మా నాన్నా లేని అనాధను బాబూ! ...మీకు తోచిన ధర్మం చెయ్యండి... పుణ్యం కోసం కొండమీదకు వెడుతున్న బాబులూ... ఈ లేనివాడికి పావలా డబ్బులిస్తే ఎంతో పుణ్యం వస్తుందయ్యా... అమ్మా...! తల్లీ...! దయ చూపించండి!" -- మనిషి మనిషీ

అడుగుతున్నాడు.

పాటలోనే కాదు.... వాడి మాటలో కూడా ఎదో వుండే వుండాలి... చాలా చేతులు జేబుల్లోకి వెళ్ళేయి...

వాడు రంగనాయకులు దగ్గరకు వచ్చేడు.

"నీ పేరేమిట్రా?" -లాల్చీ జేబులోంచి పర్సుతీస్తూ అడిగేడు రంగనాయకులు.

"శీనయ్యండి!"

రంగనాయకులు పర్సులోంచి అయిదు రూపాయల నోటు తీసేడు. అంతలోనే టోలు గేటు దగ్గర బస్సు ఆగింది.

"ఒరే శీనుగా....టోలుగేటు వచ్చేసింది.... ఇంక నీ తోలుచెయ్యి జేబులో పెట్టేసుకుని దిగిపోరా!" -డ్రైవర్ వెనక్కి తిరిగిచూస్తూ అరిచేడు.

"నువ్ కొండమీదకు రావా?" - తన చేతిలోని నోటువైపు ఆశగా చూస్తున్న శీనయ్యని అడిగేడు రంగనాయకులు.

"నాకింతవరకే పర్మిషను బాబూ!"

"ఫరవాలేదులే... నాతోపాటు కొండకు రా!" -- అంటూ నోటు వాడిచేతిలో పెట్టి వెనుకనున్న సదాశివంవైపు అర్థోక్తిగా చూశాడు.

విషయం అవగాహన చేసుకున్న సదాశివం ఆ ఆదేశాన్ని అమలుపరచేందుకు డ్రైవరు దగ్గరకు వెళ్ళేడు.

బస్సు కదిలింది......

★ ★ ★

సాయంకాలపు నీరెండలో ఆలయానికి దూరంగా లోయల సొగసుల్ని చుట్టబెట్టుకుని - ప్రకృతి శోభనంతా కళ్ళముందు నిలబెట్టుకుని - అన్నమాచార్య సంకీర్తన లాంటి సంస్పర్శను అందిస్తున్న చల్లగాలికి, పారవశ్యంతో కళ్ళు మూసుకున్న భక్తునిలా నిలబడి వుంది 'వేలీవ్యూ కాటేజ్'....

దానిముందు పచ్చని తివాసీలా వున్న మెత్తని పచ్చికమీద కూర్చున్నాడు రంగ నాయకులు. అతనికి కొంచెం పక్కగా సదాశివం....! వాళ్ళిద్దరికీ ఎదురుగా కూర్చున్న శీనయ్య చిడతలు వాయిస్తూ పాడుతున్నాడు.

"...పేరేమో గోవింద...

సోకులన్నీ ఎంకన్న..

కొండమీద నేలమీద-

అనుక్షణం జరుగుతున్న

వున్నోళ్ళ బాబులకే-మరీమరీ లోటు-

లేనోళ్ళ బీదలకు-లేదు లేదు సాపాటు!

గోవిందా...గోవిందా...

ఎంకన్న గోవిందా!...."

"ఈ పాట ఏ సినిమాలోది?" - పాట ఆగిపోయిన కొంతసేపటికి అడిగేడు రంగనాయకులు.

"సినిమాలోది కాదుసార్!"

"మరి?" - సదాశివం ఆశ్చర్యపోయాడు.

"నాదేనండి!" - తన పాటలో తప్పులున్నాయేమోననే అనుమానంతో కొంచెం సిగ్గుపడుతూ చెప్పేడు శీనయ్య.

"అంటే...నువ్వే రాశావా?"

"రాయటం నాకు రాదుసార్! నేనసలు చదువుకోలేదండి... నాకు తెలిసినప్పటి నుంచీ ఇది పాడుతున్నాను.... అంతేనండి!"

మళ్ళీ వాళ్ళ మధ్య కొంతసేపు నిశ్శబ్దం.... ఆ బాహ్య నిశ్శబ్దంలోనే రంగనాయకుల అంతరంగంలో ఎన్నెన్నో ఆలోచనలు.... వాటికి ఒక రూపం వచ్చింతర్వాత త్రిబుల్‌ఫైవ్ సిగరెట్టు తీసి వెలిగించాడు.

"సదాశివం! మన పిక్చర్‌కి కవిగారు రాసిన బిచ్చగాడు పాటకంటే ఈ పాట బాగుంది కదూ?"

"కరెక్ట్‌సార్...........నేనూ సరిగ్గా అదే చెప్పాలనుకున్నాను.... వీడి టోన్ కూడా చాలా బావుంది!" - ప్రొడక్షన్ మేనేజర్ హోదాలో చెప్పేడు సదాశివం.

"ఆల్‌రైట్! రేప్పొద్దున కళ్యాణం కాగానే శీనయ్యకూడా మనతో మెడ్రాస్ వస్తాడు!" -- అక్కణ్ణుంచి లేచి లోపలకు వెడుతూ అన్నాడు రంగనాయకులు.

శీనయ్యకి అంతా అయోమయంగా వుంది.

"నక్కని తొక్కొచ్చావురా అబ్బాయ్"-- అంటూ వాడి భుజం మీద చరిచేడు సదాశివం.

"అంటే సార్?!" భయంగా చూశాడు శీనయ్య.

"ఆయనెవరో తెలుసా? సినిమా ప్రొడ్యూసరు రంగనాయకులుగారు.... ఇప్పటికి ఎనిమిది సినిమాలు తీశారు... అందులో రెండు రజితోత్సవాలు! అయిదు శతదినోత్సవాలు!... నువ్ 'బందరు బుల్లోడు' చూశావా? 'రాతిమనిషి' చూశావా?.... పోనీ 'తీరిన కోరిక' చూశావా?"

"ఆ సినిమాలన్నింటిలో ఆయన కూడా యాక్టు చేశారాండీ?" అడిగేడు.

వాడి అజ్ఞానానికి భళ్ళున నవ్వేశాడు సదాశివం. అలా నవ్వుతున్నప్పుడు నిత్యం జరదా కిళ్ళీలో మునిగితేలే అతని గారపళ్ళు మాడిపోయిన మొక్కజొన్న గింజల్లా కనిపించాయి.

"ఓరి పిచ్చివాడా! ఆయన సినిమాల్లో యాక్ట్ చెయ్యరు! సినిమాలు తీస్తారు... అంటే ఆ సినిమాకయ్యే ఖర్చంతా ఆయనే భరిస్తాడన్నమాట! లక్షలున్నాయి... మెడ్రాసు టీనగర్‌లో ఆయనకి పెద్ద మేడ వుంది. నీలగిరిలో కాఫీ ఎస్టేటుంది. ఆయన తిరిగేందుకు రెండు కార్లున్నాయి... ఆర్టిస్టుల కోసం ఓ వేన్ కూడా వుంది!" --ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు సదాశివం.

"మరి బస్సులో వచ్చారేమిటిసార్?" --

"వచ్చే నెలలో కొత్త పిక్చర్ షూటింగ్ మొదలవుతుంది... అప్పటికి కార్లన్నీ కండిషన్‌లో వుండాలి... అందుకని సర్వీసింగ్‌కి ఇచ్చారు..."

"సినీమా పేరేమిటి సార్?" --అడిగేడు శీనయ్య.

"పేదలపెన్నిధి!.... అందులో బిచ్చగాడు పాడేపాట ఒకటుంది.... అది హైలైటు కావాలని ఆయన పట్టుదల ... అందుకే నలుగురు కవుల చేత ఆ సీనుకి పాట రాయించారు... ఇంకా తృప్తిలేదు...అసలు నీకు తెలీదుగానీ - ఆయనకి పాటలంటే ప్రాణం!... సినీమాలో కథ లేకపోయినా, పాటలన్నీ బంపర్ హిట్ కావాల్సిందే!" --తాను ప్రొడ్యూసర్ అయిపోయినంత గర్వంగా చెప్పేడు.

అతను చెప్పేది అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ - విభ్రాంతిగా చూస్తున్నాడు శీనయ్య.

"ఇప్పుడు నిన్ను మెడ్రాసు ఎందుకు రమ్మన్నారో తెలుసా?" అడిగేడు సదాశివం.

"సినిమాలో నాచేత కూడా యాక్ట్ చేయిస్తారా సార్?" -- ఆత్రంగా ప్రశ్నించేడు శీనయ్య.

"ఏమో - యాక్టింగే చేయిస్తారో, సింగింగే చేయిస్తారో?" - జర్దాకిళ్ళీ ఒకదాన్ని

బుగ్గన బిగించాడు.

"సింగింగా?"--

"అదేరా! షింగింగంటే పాట్టం ....! పాటలు రికార్డింగు పదిరోజుల్లో మొదలవు తుందనగా - ఇక్కడకొచ్చి స్వామి దర్శనం చేసుకుంటారాయన!... ప్రతీ పిక్చరుకీ ఇదే ఆనవాయితీ!... .ఏది ఏమైనా నీ రొట్టెవిరిగి నేతిలో పడిందిరా?" -జరదా కిళ్ళీ తాలూకు రసాస్వాదన వల్ల మాటలు గమ్మత్తుగా వినవచ్చాయి.

"అయితే కిందకెళ్ళి మా అవ్వకి చెప్పొస్తాను సార్?" - లేచి నిలబడ్డాడు శీనయ్య...

"అనాధనన్నావ్....ఎవరూ లేరన్నావ్?" అడిగాడు సదాశివం వెంటనే.

"కానీ అవ్వుంది సార్!... కింద రైలుస్టేషన్ ఎదురుగుండా పుల్లట్లు వేస్తుంది... చీకటి పడేసరికి నేను వెళ్ళకపోతే ఖంగారుపడిపోతుది!"

సరిగ్గా అప్పుడే లోపలనుంచి వచ్చిన రంగనాయకులు ఆమాట విన్నాడు.

"ఎవర్రా ఖంగారుపడేది?" - అడిగేడు.

ఆ ప్రశ్నకు సమాధానం సదాశివం చెప్పేడు.

"అయితే నువ్వో పనిచెయ్ సదాశివం! వీణ్ణి తీసుకెళ్ళి, ఆవిడకి విషయం చెప్పి ఒప్పించి మళ్ళీ వెంటనే వచ్చేయండి...ఈలోగా నేను ఓసారి స్వామిదర్శనం చేసుకొస్తాను" -అంటూ ముందుకు కదిలేడు రంగనాయకులు.

★ ★ ★

"అదిగో సార్ మా అవ్వ!" - ఉత్సాహంగా చూపించాడు శీనయ్య.

నియాన్ దీపం కాంతిలో - రోడ్డు పక్కన కూర్చున్న అవ్వ అట్లు పోస్తోంది. చుట్టూ ఎవరో నలుగురు చేరి - కబుర్లాడుకుంటూ అట్లు తింటున్నారు.

పెనంమీద అట్టు తిరగేసి - ఎదురుగా చూసిన అవ్వకి శీనయ్యా సదాశివం కనిపించారు..... డాబుసరిగా కనిపిస్తున్న సదాశివం, తన శీనయ్యతో ఎందుకున్నాడో అర్థం కాక ఆందోళన పడుతున్న అవ్వని సమీపించి, ఆమె మెడ చుట్టూ చేతులు వేసి వెర్రి ఆనందంతో చెప్పేడు శీనయ్య -

"అవ్వా నేను మెడ్రాసెడుతున్నానే!"--

"మెడ్రాసా? .... ఎందుకురా?" - అట్టు మాడిపోతున్నా గమనించక మరీ ఆశ్చర్యపోయింది అవ్వ.

"ఎందుకో నేను చెప్తానుండవ్వా!" - అంటూ లాల్చీ జేబులోంచి పర్సుతీశాడు సదాశివం. అవ్వతోబాటు అక్కడున్న నలుగురూ అట్లు తినటం మానేసి అతనివైపు వింతగా చూస్తున్నారు.

"ఒరేయ్ శీనయ్యా!.... ఆ కిళ్ళీకొట్లోకెళ్ళి ఓ ఆరడజను కిళ్ళీలు కట్టించుకురా!.... బాబా జరదా...కాశ్మీరీఖిమాం...కొద్దిగా రాజారతన్ అని చెప్పు ..... కాసొద్దుసుమా.... జ్ఞాపకం వుంటుందా?" - పర్సులోంచి పది కాగితం తీసి ఆ లిస్టు మళ్ళీ చదవబోయాడు....

అదేం వినిపించుకోకుండానే, అతనిచేతిలోంచి పదినోటు అందుకుని బాణంలా దూసుకుపోయాడు శీనయ్య.

"సురుకుపాలెక్కువ ఎదవకి!....ఏ మాతల్లి కన్నదో!" - మాడిపోయిన అట్టుతీసి పక్కనున్న సిల్వర్ పళ్ళెంలోవేసి - పింగాణీ గిన్నెలోని పిండిని గరిటెతో కలుపుతూ అనుకుంది అవ్వ.

"అంటే... నీ మనవడు కాదా?" - అడిగేడు సదాశివం.

"కాదుబాబూ .... ఎప్పుడో పన్నెండేళ్ళ క్రితం - అదిగో ఆ బస్టాండులో అరుగులేదూ!... అక్కడ దొరికాడుబాబూ ఈడు!...ఎవరోగానీ కొండకొచ్చి - ఈ బంగారు కొండని వదిలేసి వెళ్ళి పోయారు... పాపం...! రాజిరెడ్డి, గోవిందరాజులూ, ఏసుపాదం - ఆళ్ళంతా ఈణ్ణి చూసి జాలిపడి - తీసుకొచ్చి నా సేతుల్లో పెట్టేరు. నన్నే సూడమన్నారు. కాదన్లేకపోయాను బాబూ!... ఆళ్ళకి ఈడంటే ఎర్రి అభిమానం... అందుకే ఆళ్లు కూడా అప్పుడప్పుడు డబ్బులిస్తూంటారు. ఆళ్ళు ఇయకపోతే మాత్రం నేను పెంచలేనా?...నాకు మాత్రం ఎవరున్నారు బాబూ?... ఇరవై ఏళ్ళ క్రితం ఈ రైలు టేసన్లోనే నా కొడుకు కూలిపని సేసేవాడు.... ఇరవై నాలుగ్గంటలూ ఒకటే తాగుడు ఎదవ సచ్చినోడికి!... ఆ మత్తులోనే ఓ రోజు రైలు కిందపడి సచ్చిపోయాడు! అయినా దేవుడున్న ఈ సోటులో తాగితే ఆ దేవుడికి కోపం రాదా బాబూ?... -- అందుకే ఆణ్ణి తీసుకుపోయాడు..... కానీ ఈడు పాటలు సాలా బాగా పాడతాడు బాబూ!"- అవ్వ కళ్ళల్లో నిలిచిన భాష్పాలు ఆనందానివో ఆవేదనవో తెలియకపోయినా, జరదాకిళ్ళీసదాశివాన్ని కదిలించేయి...ఒక్కసారిగా రెండు కిళ్ళీలు వేసేసుకోవాలనిపించింది... ఇబ్బందిగా బుర్రగోక్కుంటూ-- శీనయ్య కోసం కిళ్ళీ కొట్టు వైపు చూశాడు. చిరిగిన చెంగుతో కళ్లొత్తుకుంటూ అవ్వ మళ్ళీ చెప్పింది --

"ఏటి బాబూ...ఆడు మెడ్రాసంటున్నాడు?... ఆణ్ణి ఏదైనా పన్లో పెడుతున్నారా?... కానీ ఆడులేందే నేను ఉండలేను బాబూ"--

సదాశివం విషయమంతా వివరంగా చెప్పేడు...

పూర్తిగా అర్థం కాకపోయినా - 'అదేదో అదృష్టమే'ననుకుని ఆనందంలో పొంగి పోయింది అవ్వ. కిళ్ళీకొట్టు దగ్గర్నుంచి వస్తున్న శీనయ్యని చూస్తూ ఆప్యాయంగా మెటికలు విరుచుకుంది.

ఆ తర్వాత గబగబా అట్లు వేసింది... నాలుగు పొట్లంలో కట్టి శీనయ్య చేతిలో పెట్టింది. మరో రెండు ప్లేట్లో పెట్టి - చెట్నీ వేసి "తినండి బాబూ!" -- అంటూ సదాశివానికి ఇవ్వబోయింది.

ఆ క్షణంలో అవ్వ ఆప్యాయతకు మనసు కరిగి తినాలనిపించినా తెలియని హోదా ఏదో అడ్డురావటంతో --

"వద్దవ్వా! కిళ్ళీ వేసుకున్నాను!" -- అంటూ శీనయ్య చేతిని పట్టుకుని వెంటనే అక్కణ్ణించి కదిలేడు సదాశివం.

★ ★ ★

ప్రాతఃకాలం మేలుకొలుపు పలికింది.

సూర్యకిరణాలు బంగారుగోపురం మీద పడి - విమాన వెంకటేశ్వరుడికి కైమోడ్పు లందిస్తున్నాయి..

సుప్రభాత దర్శనం పూర్తి చేసుకుని - తన కాటేజ్‌కి తిరిగి వచ్చాడు రంగనాయకులు... అతన్ని అనుసరించి సదాశివం! ఆ వెనకనే శీనయ్య... అతని చేతిలో ప్రసాదం!

కాటేజ్ వరండాలో నిలబడి వున్న ఆగంతకులు, లోపలకు వస్తున్న రంగనాయకుల్ని చూసి వినయంగా నమస్కరించారు.

"నాపేరు రాజిరెడ్డి సార్..........డ్రైవర్ని......నిన్న నాబస్సులోనే తమరొచ్చారు.......... వీడు గోవిందరాజులు!" పరిచయం చేసుకున్నారు వాళ్ళిద్దరూ.

"ఏం కావాలీ?"- అడిగేడు రంగనాయకులు.

"శీనయ్య కోసం వచ్చామండి! ఈణ్ణి తవరు మెడ్రాసు తీసుకెడుతున్నారని రాత్రి అవ్వ చెప్పింది... అందుకే ఓసారి చూసిపోదావని-తవర్ని వెతుక్కుంటూ వచ్చాం!" వినయంగానే చెప్పేడు గోవిందరాజులు.

"అవును!...మీ శీనయ్య బాగా పాడతాడు. అందుకే తీసుకెడుతున్నాను!"

"విన్నాను బాబూ...అవ్వ చెప్పింది...ఈణ్ణి తల్లీ తండ్రీ లేని అనాధని చేసినా మంచి గొంతిచ్చి మేలు చేసేడు మా వెంకన్న తండ్రి! సిన్నప్పట్నించీ 'అప్పారావ్‌కూల్‌డ్రింక్' షాపులో కూర్చుని, ఎప్పుడూ పాటలు వినేవాడు..."గోవిందరాజులు అన్నాడు.

"ఈణ్ణి అక్కడే వుంచేసుకుంటారా సార్!" శీనయ్యను దగ్గరగా తీసుకుంటూ రాజిరెడ్డి అడిగేడు...

"లేదు! పనయిపోగానే, రెండు మూడు రోజుల్లో --మా మనిషినిచ్చి మళ్ళీ జాగ్రత్తగా మీ దగ్గరకు పంపించేస్తాను" --అని లోపలకు వెళ్ళబోతున్న వాడల్లా ఆగిపోయి--

"శీనయ్యా! మీ వాళ్ళకి ప్రసాదం పెట్టు" -- అన్నాడు.

శీనయ్య ఇచ్చిన ప్రసాదాన్ని కళ్ళకు అద్దుకుని - కొంచెం నోట్లో వేసుకున్నాడు రాజిరెడ్డి...తక్కినది శీనయ్య నోట్లోవేసి---

"ఒరేయ్! పెద్దోళ్ళు!.... జాగ్రత్తగా మసులుకో--ఇదిగో ఈలెఖ్ఖ దగ్గరుంచు!" - అంటూ రెండు పది నోట్లు వాడి జేబులో పెట్టేడు...

"అక్కడ కూడా ఈ కాకీబట్టల్తో తిరిగితే బాగోదు. ఈ సొక్కాలాగూ అక్కడేసుకో" అంతక్రితం రాత్రి ఫుట్‌పాత్ మీద తాను కొన్న బట్టల్ని శీనయ్య చేతిలో పెట్టేడు గోవిందరాజులు

★ ★ ★

ఎయిర్ కండిషన్ గదిలో కూర్చున్న రంగనాయకులూ, డైరెక్టర్ వాసుదేవమూర్తీ ప్రొడక్షన్ మేనేజర్ సదాశివం, మ్యూజిక్ డైరెక్టర్ శివశంకర్ అందరూ టేప్ రికార్డర్‌లోంచి వస్తున్న సంగీతరావ్ పాటని ఏకాగ్రతగా వింటున్నారు.

పాటపూర్తయిన తర్వాత రికార్డర్ 'ఆఫ్' చేసి డైరక్టర్ వైపు చూశాడు రంగనాయకులు.

"వెరీగుడ్ సాంగ్ ! చాలా నేచురల్‌గా వుంది. చిడతల చప్పుడు పాటకి లైఫిచ్చింది. ఏమైనా మీది గొప్ప టేష్టు!" చెప్పేడు వాసుదేవమూర్తి.

రంగనాయకులు గర్వంగా అందరి వైపూ చూసి అన్నాడు-

'నా టేష్టు గొప్పదే కావచ్చు ! కానీ సంగీతరావ్‌కి ఇది పాడటం ఒక టెస్టు !"

సరిగ్గా అదే సమయంలో లోపలకు అడుగు పెట్టిన సంగీతరావ్ ఆ మాట విన్నాడు.

"మీరు గతంలో తీసిన అన్ని పిక్చర్స్‌లోనూ నాకు టెష్టు పెట్టారు. అయినా నేను ఛాలెంజ్‌గానే తీసుకుంటాను" భుజాలెగరేస్తూ అన్నాడు సంగీతరావు.

అతని కోసం మళ్ళీ టేప్ రికార్డర్‌లోని పాటను వినిపించేడు రంగనాయకులు.

"పాట చాలా బాగుంది. కుర్రాడెవరో చాలా బాగా పాడేడు ఈ ఊరేనా ? " - పాట విన్న తర్వాత సోఫాలో వెనక్కి జార్లాపడుతూ అడిగేడు సంగీతరావు.

"కాద్సార్ ! తిరుపతిలో వుంటాడు. బస్సులో పాడుతూ అడుక్కుంటూంటాడు!

ఉన్న ప్రొడ్యూసరుగారూ, నేనూ తిరుపతి వెళ్ళినపుడు తీసుకొచ్చాం... మ్యూజిక్ డైరక్టరు ఈ పాట నిన్ననే రికార్డ్ చేశారు. ఆ కుర్రాడు ఇవాళ పొద్దున్న వెళ్ళి పోయాడు" సదాశివం చెప్పేడు.

"సో ... ఇదే ట్యూన్‌లో ఈ పాటని నేను పాడాలన్నమాట" తనలో తాను అనుకుంటున్నట్టుగా అన్నాడు సంగీతరావ్.

"అవును ! ట్యూనూ, చిడతల ప్రయోగం అలావుంటేనే చాలా బావుంటుంది. ఆ కుర్రాడు బస్సులో పాడుతున్నప్పుడు ప్రయాణీకులంతా ఎంత థ్రిల్లయిపోయారో నేను ప్రత్యక్షంగా చూశాను. మీకు తెలీదు. ఈ పాటని ఎన్నేళ్లనించో ఎన్నిసార్లో ఎంతో మంది దగ్గర పాడేట్ట! అంతమందిని మెప్పించిన ఈ పాట ఇదే ట్యూన్‌లో, ఇలాగే వుంటే - అందులోనూ మీరు పాడితే, తప్పకుండా ప్రజాదరణ పొందుతుంది!" ధృఢంగా అన్నాడు రంగనాయకులు.

★ ★ ★

పాట రికార్డింగు పూర్తయింది.

ఆర్కెస్ట్రా మనుషులంతా వెళ్ళిపోయిన తర్వాత స్టూడియోలో కూర్చుని శీనయ్య పాటనీ సంగీతరావు పాటనీ రెండుమూడు సార్లు 'ప్లే' చేసుకుని విన్నారంతా.

"సంగీతరావ్ గారు గొంతు బ్రహ్మాండంగా మార్చారు. అచ్చం పన్నెండేళ్ల కుర్రాడు పాడినట్టే వుంది" అన్నాడు శివశంకర్.

"అదే వీరి స్పెషాలిటీ సార్...ఎంతమంది హీరోలకు ఈయన పాడలేదు చెప్పండి! ఆ మాటకొస్తే కమెడియన్లకి, విలన్లకి కూడా ఈయన పాడితే తప్ప జనం ఒప్పుకోటం లేదు" ఘనంగా చెప్పేడు సదాశివం.

రంగనాయకులు మాత్రం ఆలోచిస్తూ ఉండి పోయాడు. అతని కళ్ళలో ఉత్సాహంగానీ, సంతృప్తిగానీ కనిపించలేదు సంగీతరావుకి.

"మీ అభిప్రాయం చెప్పలేదు" అడిగేడు.

"మీరు గొంతు బాగా మార్చిన మాట నిజమే...కానీ ఎందుకో ఆ కుర్రాడు పాడిన పాటలో సహజత్వం కనిపిస్తోంది." చెప్పేడు రంగనాయకులు సాలోచనగా చూస్తూ.

"అలా అయితే...పోనీ, ఆ పాటే వుంచేద్దాం!" అన్నాడు సంగీతరావ్ .

సంగీతరావు మాట విని అక్కడున్న వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. అతని ఔదార్యాన్ని చూపులతోనే అభినందించారు.

"మీరు మరోలా భావించకూడదు మరి!" ఇబ్బందిగా చూస్తూ అన్నాడు రంగనాయకులు.

"నో....నో...భలేవారే...ఇందులో అనుకోటానికీ ఆలోచించటానికీ ఏముంది సార్?... మీకు కావల్సింది ఆ పాటేగదా? అదే బాగుందని అనుకుంటే అదే వుంచండీ! ...కానీ రికార్డు మీద నాపేరుంటుంది" ఆ మాటలకు అందరూ ఈసారి దిగ్భ్రాంతిగా అతనివైపు చూస్తుండగానే అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సంగీతరావు.

★ ★ ★

ఆర్నెల్లు గడిచిపోయాయి....

ఆరోజు 'పేదల పెన్నిధి' సినిమా తాలూకు శతదినోత్సవ వేడుకలు తిరుపతిలో భారీ ఎత్తున ఏర్పాటయ్యాయి.

సినిమాహాలు దగ్గర ఒకటే కోలాహలం...తమ అభిమాన నటుల్ని చూడాలని జనం వేలం వెర్రిగా-ఇసుకవేస్తే రాలనంతగా వచ్చేరు...వాళ్ళందర్నీ అదుపులో వుంచటానికి పోలీసులు విఫలయత్నం చేస్తున్నారు.

అందరికీ హాల్లో ప్రవేశం దొరకటం కష్టం కనుక, కనీసం వారి అభిమాన నటుల మాటలయినా వినటానికి వీలుంటుందని బయట స్పీకర్లు ఏర్పాటు చేశారు.

ఆ స్పీకర్లోంచి ఎవరిదో గొంతు వినిపిస్తోంది...

"...ఈ సినిమా విజయానికి కారణం, కేవలం ఇందులోని బిచ్చగాడి పాట!...సంగీతరావు ఈ పాట పాడి ధన్యులయ్యారు"

చప్పట్లు...

"....గత పదేళ్ళుగా కొన్ని వేల పాటలు సంగీతరావుగారు పాడేరు...కానీ ఈ పాట ఆయనకి ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టింది..."

"...ఈ పాటకు జాతీయ స్థాయిలో బహుమతి రావటం మన తెలుగు సంగీతానికే గర్వకారణం..."

"...సినీమా విడుదల కాకముందే బిచ్చగాడుపాట రికార్డు అత్యధిక సంఖ్యలో అమ్ముడుపోయి ఓ రికార్డు సృష్టించింది...."

మళ్ళీ చప్పట్లు...

మళ్ళీ ఎవరెవరివో ఉపన్యాసాలు...మళ్ళీ చప్పట్లు...మళ్ళీ అభినందనలు..... మళ్ళీ మళ్ళీ చప్పట్లు...

సంగీతరావు తన ఉపన్యాసాన్ని ముగించిన తర్వాత--ఆ బిచ్చగాడు పాటలోని పల్లవిని మాత్రం పాడి వినిపించాడు.

ఈసారి హాలు బయటవున్న జనం కూడా ఉత్సాహంగా ఈలలు వేసి చప్పట్లు కొట్టేరు...కానీ--

అక్కడే...ఆ జనంతోనే వున్న శీనయ్య మాత్రం ఎందుకో అందరితో పాటు చప్పట్లు కొట్టలేకపోయాడు...

ఆ మర్నాడు--

కొండమీద వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని తన భార్యతో ఆలయంలోంచి బయటకు వచ్చిన సంగీతరావ్ లీలగా వినిపిస్తున్న పాట విని క్షణంసేపు ఆగిపోయాడు.

అక్కడికి కొంచెం దూరంలో ...పుష్కరిణి పక్కనే ఓ చిన్న గుంపు కనిపించింది... ఆ గుంపు మధ్య శీనయ్య పాడుతున్నాడు... అదే పాట ...బిచ్చగాడు పాట!...అదే గొంతు... అదే శృతి... అదే లయ!!...

అప్రయత్నంగా అటు నడిచేడు సంగీతరావు.

"చూశావా!....నాపాట ఎంత పాప్యులర్ అయిందో?...ఆఖరికి-- కుర్రాళ్ళకు కూడా బాగా పట్టేసింది...!" --ఆమెతో అన్నాడు గర్వం తొణికిసలాడేస్వరంతో.

ఆమె కూడా కుతూహలంగా పాట వింటోంది-

"...అంటరానివాడు కాదు గోవింద...

అందరానివాడు కాదు గోవింద!

ఎందుకయ్య గొడవలు...మనమధ్య గోడలు!

చేరుకో సప్తగిరులు...

కలిసుంటే కలుగు సిరులు!

గోవిందా గోవిందా-వెంకన్నా గోవిందా!!....

పాట తన్మయత్వంలోంచి ఒక్కసారిగా బైటపడిన సంగీతరావ్ భార్య అడిగింది-

"ఏమండీ! మీరు పాడిన పాటలో ఈ ఆఖరి చరణం లేదేమిటీ?"-- అని !

సమాధానం దొరకని సంగీతరావు-గబగబా పుష్కరిణి మెట్లుదిగి -అందులోని నీళ్ళుతీసి తలపై చల్లుకున్నాడు!! ★

(ఆంధ్రభూమి 6-8-81)